**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేది.16.08.2018.**

# ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న నిందితుడు అరెస్ట్

ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానని నమ్మించి, వారి వద్ద నుండి రూ. 10 లక్షల మేరకు నగదు తీసుకుని మోసగించిన నిందితుడిని ది. 16. 08. 2018న మాచవరం పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది.

ఈ కేసుకు సంబంధించి విజయవాడ మొగల్‌రాజుపురానికి చెందిన గుంటూరు సుధాకర్ అనే వ్యక్తి తనను మరియు తన స్నేహితులను రిమ్మలపూడి శివరామకృష్ణ కిషోర్ అనే వ్యక్తి ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానని చెప్పి నమ్మించి, తమ వద్ద నుండి రూ.10 లక్షల నగదు తీసుకుని మోసగించినట్లు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వివరాలు వెలుగులోకి వచ్చాయి.

రిమ్మలపూడి శివరామకృష్ణ కిషోర్ (37) అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. శివరామకృష్ణ గతంలో సిఎం క్యాంపు కార్యాలయంలో చిన్నచిన్న కాంట్రాక్ట్ పనులు చేయడం జరిగింది. సంబంధిత కాంట్రాక్ట్ పనులు పూర్తయిన అనంతరం కూడా తన ఇన్నోవా కారుకు (నెం. ఏపి16 ఈఈ 0906) ప్రభుత్వ వాహనంగా బోర్డును మరియు సైరన్‌ను తగిలించి తిరగడంతో పాటు, కాంట్రాక్ట్ పనులకు సంబంధించి గడుపు ముగిసిన గుర్తింపు కార్డును అడ్డుపెట్టుకుని కాంట్రాక్ట్ పనుల పేరుతో ప్రజలను నమ్మించి సులబంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో మొగల్‌రాజుపురానికి చెందిన గుంటూరు సుధాకర్, కంచాల సతీష్ మరియు సత్తిబాబులతో శివరామకృష్ణ పరిచయం పెంచుకుని తనకు సిఎం క్యాంపు కార్యాలయంలో మంచి పలుకుబడి ఉందని, ఉన్నతాధికారులను ఒప్పించి ప్రభుత్వ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించి, 2017 సం॥లో ముగ్గురి వద్ద నుండి సుమారు రూ.10 లక్షల వరకు పలు దఫాలుగా నగదు వసూలు చేయడం జరిగింది.

ఈ విధంగా శివరామకృష్ణ గడువు పూర్తయిన గుర్తింపు కార్డును అడ్డుపెట్టుకుని, చట్టవిరుద్ధంగా తన కారుకు ప్రభుత్వ వాహనం పేరుతో బోర్డును తగిలించడంతో పాటు సైరన్‌ను ఉపయోగిస్తూ కాంట్రాక్ట్‌లు మరియు ఉద్యోగాలు ఇప్పస్తానని అనేక మంది నుండి డబ్బులు వసూలు చేసి మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది.

ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇప్పిస్తానని లేదా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించే వారిని ఆశ్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. అలా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుంది.

--xx--